# మిస్టర్ ముకుందం

బూట్లు కట్టుకొని, వాటిని మరికొంచెం నిగనిగలాడేట్టు తుడిచి నెక్టై బిగించుకొంటూ నిలువుటద్దం ముందుకెళ్ళి నిలబడ్డాడు మిస్టర్ ముకుందం. చిన్నప్పుడు మేనమామ బహూకరించిన జర్మన్ గోల్డు పిన్నును టై మధ్యలో అమర్చాడు.

నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని అన్నికోణాలనుంచీ పరిశీలించి చూసుకొని సంతృప్తిగా నిట్టూర్చాడు. అతనికి అద్దాన్ని ముద్దెట్టుకోవాలనిపించింది. అతనికి ఆ అద్దం అంటే వల్లమాలిన అభిమానం. ఆరోజు ఆ అభిమానం హృదయం అంచుల్ని తాకింది.

మిస్టర్ ముకుందానికి చిన్నప్పటినుంచీ నిలువుటద్దంలో తనను చూసుకోవడం ఇష్టం. తన స్నేహితుడు రామం ఇంట్లో నిలువుటద్దం ఉందని తెలిసి అతనితో స్నేహంచేశాడు. నిలువుటద్దంవున్నవాళ్ళు చాలా గొప్పవాళ్ళనే భావంవుండేది మిస్టర్ ముకుందానికి చిన్నప్పుడు.

అవకాశం దొరికినప్పుడల్లా మిస్టర్ ముకుందం రామం ఇంటికి వెళ్ళేవాడు. తన ప్రతిబింబాన్ని ఆ నిలువెత్తు అద్దంలో అన్ని కోణాల నుంచీ చూసుకొంటూ మురిసిపోయేవాడు.

ఏనాడూ ఎవరూ అతన్ని అందంగా వున్నావన్న పాపాన పోలేదు. మనసులో ఓమూల ఆ బాధ పుష్పంలో పురుగులాగా తొలుస్తూనేవుంది అతని మనస్సును.

లోకంతీరే అంత! ఇతరుల్లోని సుగుణాలను చస్తే మెచ్చుకోదు. తనకేం? తను లక్షణంగా వుంటాడు. ఆ సంగతి ఒకళ్ళు చెప్పాలా ఏం?

తనను తనే బుజ్జగించుకొనేవాడు మిస్టర్ ముకుందం.

ముకుందం మొదటి జీతం అందుకొన్ననాడు మొదటకొన్న వస్తువు ఈ నిలువుటద్దం. ఇదికూడ ఒక కారణం, అతనికి ఆ అద్దం అంటే అంత అభిమానం కలగటానికి.

మరోసారి అద్దంలో చూచుకొన్నాడు. దువ్వెన పళ్ళలా నిటారుగా నిక్కపొడుచుకొని నిల్చున్నజుట్టు కనిపించింది. జుట్టును మరోసారి బ్రష్‌చేశాడు. అణిగినట్టే అణిగి అంతలోనే నిటారుగా లేచి నిల్చుంది జుట్టు. చీటికిమాటికి చీవాట్లువేసే ఆఫీసరుముందు నిలబడ్డ ఆత్మాభిమానంగల గవర్నమెంటు సర్వెంటులాగ.

ముకుందానికి తన జుట్టుమీద వల్లమాలినకోపం వచ్చింది.

కాని పాపం! ఏంచేస్తాడు? అది తన జుట్టయిపోయింది. లేకపోతేనా? తనకు అందుబాటులోవున్న మరొకరి జుట్టయితేనా? గుండు కొట్టించి దానిపని పట్టేవాడు.

తన ఆలోచనకు నవ్వొచ్చింది మిస్టర్ ముకుందానికి.

ముఖానికి పౌడర్ రాసుకొన్నాడు. రుమాలుతో స్టేజీమీద నటునిలా అతి జాగ్రత్తగా అద్దుకున్నాడు. మరికొంచెం పౌడపు రుమాలు మడతల్లో చల్లుకుని జేబులో పెట్టుకున్నాడు.

మరోసారి ముఖాన్ని చూసుకొని అద్దంముందునుంచి కదలబోయిన ముకుందానికి మనస్సులో తుమ్మముల్లు గుచ్చుకున్నట్టయింది.

అతనికి తన నడుం సన్నగా పీలగా అసహ్యంగా వున్నట్టు కన్పించింది. గతుక్కుమన్నాడు.

ఎన్ని టానిక్కులు తాగినా ప్రయోజనంలేందే? తను అంత పీలగా వుంటాడని ఇంతకుముందెప్పుడూ అనిపించలేదు. కాకపోతే కొంచెం సన్నం అనిమాత్రం అనుకొనేవాడు.

గబగబా వెళ్ళి పెట్టెతెరచి తనకున్న ఆ ఒకే ఒక కోటును తీసి వేసుకొన్నాడు మిస్టర్ ముకుందం.

మరోసారి అద్దంలో చూసుకొని "హమ్మయ్య" అంటూ నిట్టూర్చాడు సంతృప్తిగా.

క్రితంరోజుకొన్న "సెవెన్ హెవెన్స్" గుర్తొచ్చింది.

"అరెరే! మర్చేపోయాను. గుర్తుండటానికి నాకు అలవాటుండేగా?" పైకే అనుకున్నాడు మిస్టర్ ముకుందం.

టేబుల్‌మీదవున్న సెంట్‌బాటిల్ అందుకొని చెవులవెనకా షర్టుకూ పులుముకొన్నాడు.

సాయంకాలపు చల్లగాలి కిటికీలోనుంచి ముకుందాన్ని పరామర్శించింది.

చేతిగడియారం చూచుకొన్నాడు.

"ఛ? ఇంకా ఐదుకూడా కాలేదు" విసుక్కున్నాడు.

కాలానికి కాళ్ళు లేవనీ, దేక్కుంటూ నడుస్తుందనీ మొదటిసారిగా అనిపించింది ముకుందానికి.

అప్రయత్నంగానే ముకుందం చెయ్యి ఫాంటుజేబులో జొరబడి ఒక ఉత్తరాన్ని బయటికి లాగింది. ఆ ఉత్తరాన్ని పెదవులకు ఆనించుకొన్నాడు. ఆనందంతో మెరిసిపోతున్న కళ్ళతో కవరుమీదవున్న తన పేరును .... ముత్యాల్లాంటి అక్షరాల్లోవున్న తన పేరును తనివితీరా చూసుకొన్నాడు.

అంత అందమైన అక్షరాలు వ్రాసిన ఆ చెయ్యి ఇంకెంత అందంగా ఉంటుందో? అంత అందమైన చెయ్యిగల ఆ అమ్మాయి ఇంకెంత అందంగా ఉంటుందో?

మిస్టర్ ముకుందానికి చిన్నప్పుడు అమ్మమ్మ చెప్పిన కథ జ్ఞాపకం వచ్చింది.

"అనగనగా ఒక కాకులు దూరని కారడవి చీమలుదూరని చిట్టడవి. ఆ అడివిలో రాజకుమారు డొకడు, మంత్రికుమార సమేతుడైన పంచకళ్యాణి గుర్రంయెక్కి ఆగమేగాలమీద పయనిస్తున్నాడు. అకస్మాత్తుగా గుర్రం ఆగిపోయింది. ఆశ్చర్యంతో గుర్రం దిగాడు రాకుమారుడు. మంత్రికుమారుడుకూడా దిగాడు.

పంచకల్యాణి గుర్రం ముందుకాలుయెత్తి నిల్చునిఉంది. మంత్రి కుమారుడు వంగి పరిశీలించాడు. ఆ గుర్రం కాలుకు ఒక పొడవాటి వెంట్రుక చుట్టుకొనివుంది. దాన్నితీసి రాకుమారునికి చూపించాడు మంత్రి కుమారుడు. అది చూస్తూనే దాని సౌందర్యానికి ముగ్ధుడై మూర్ఛపోయాడు రాకుమారుడు.

కొంతసేపటికి తన మూర్ఛ తాను తెలుపుకొని లేచి కూర్చున్నాడు రాకుమారుడు.

"ఆహా! ఏమా వెంట్రుక సౌందర్యం! ఇంత సుందరమైన జుట్టుగల ఆ సుందరి సౌందర్యం ఎటువంటిదోగదా? మంత్రికుమారా! ఆమెలేని నా జీవితం వ్యర్థం. ఎన్ని ఇక్కట్లకు గురైనాసరే ఆ అద్వితీయ సౌందర్యరాసిని వెతికిపట్టుకోవాలి, బయలుదేరు" అంటాడు రాకుమారుడు.

తనకు ఆ కథ తల్చుకున్నప్పుడల్లా నవ్వొచ్చేది. కాని ఆ కథలో నిగూఢార్థం ఇప్పుడు తనకు తెలిసింది. తనకు ఆ దస్తూరి చూడగానే మూర్ఛరాలేదుగాని వచ్చినంత పనయింది.

ముకుందం ముసిముసిగా నవ్వుకుంటూ ఉత్తరం విప్పి చదవసాగాడు.

"ప్రియమైన అనూరాధా !"

ఇంతకాలానికి మిమ్మల్ని చూసే అదృష్టం నాకులభించబోతుంది, ఎంతో కాలంగా నా ఊహల్లోనే కదుల్తూ, కదిలిస్తూ, కవ్విస్తూన్న నా అభిమాన రచయిత్రిని కలుసుకొనే, క్షణం దగ్గర్లోనే వుందనేభావం నన్ను సంతోష సాగరంలో ముంచేస్తుంది. ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాను. ఆదివారం సాయంకాలం మిమ్మల్ని కలవటానికి మీరు నిర్దేశించిన స్థలానికి తప్పక వస్తాను. ఆరుగంటలకు తప్పక వస్తాను.

ఇట్లు,
మీ
సుధారాణి"

"మీ సుధారాణి!"

చిన్నగా ముకుందం పెదవులు ఉచ్చరించాయి. తనువు పులకించింది. మనస్సు పరుగులు తీసింది. గుండె వేగం హెచ్చింది. మెదడు ఆలోచనలతో ఈగలు ముసిరి బెల్లంగడ్డంలావుంది.

అవును నిజమే.ఆమె తన సుధారాణియే! అతిత్వరలోనే తన హృదయ రాణి కాబోతూంది. పట్టుమని పది కథలైనా వ్రాయని తనను సుధారాణి అంతగా అభిమానించడం నిజంగా తన అదృష్టమే.

అభిమానం! తనమీద సుధారాణికి ఉన్నది వట్టి అభిమానమేనా? లోతుగా ఆలోచిస్తే అభిమానానికీ, ప్రేమకూ అట్టేదూరం లేదు.శబ్దభేదమే కాని భావభేదం అట్టేలేదు.

అంటే....అంటే....? సుధారాణి తనను అభిమానిస్తుందంటే.... తనను ప్రేమిస్తుందనేగా?

మిస్టర్ ముకుందానికి ఎలాగో "ఎలాగో" ఉంది. వెంటనే ఏదో సినిమాలో పాట గుర్తొచ్చింది.

"ఎలాగో ఎలాగో ఉన్నదీ.... ఇలాగే ఉంటదా .... తొలిప్రేమ అన్నదీ."

ఎవరబ్బా ఈ పాట వ్రాసిందీ. నారాయణరెడ్డికాదూ; ఏమో సరిగా జ్ఞాపకం వచ్చి చావటంలేదు. ఎవరైతే ఏంగానీ, తస్సాదియ్యా. బలేరాశాడులే. అచ్చంగా తనకు ఇప్పుడు అలాగే ఉంది. పాడాలని ఉంది. గెంతాలని ఉంది. నవ్వాలనిఉంది. ఏడ్వాలని ఉంది .... ఇంకా ఏదో....ఏదో....చెయ్యాలని వుంది.

ఒకవేళ సుధారాణి తనను ప్రేమించటంలేదేమో?

ఆ ఆలోచన రాగానే మిస్టర్ ముకుందానికి తాను కూర్చున్నచోటు అరంగుళం భూమిలోకి కుంగిపోయినట్లనిపించింది.

ప్రేమించకపోవడం ఏమిటి అంత ఇదిగా "అభిమానరచయిత" అని రాస్తేనూ?

"కాస్తదోర ముదిరిన అభిమానమే ప్రేమ."

అన్న వాక్యాలు తను ఎక్కడో చదివినట్లు బాగా గుర్తు

ఎవరబ్బా రాసింది ? అరే తన మతిమరుపు మండిపోను? తనేగా తన మొదటి కథలో రాసింది ?

ముకుందం వాలుకుర్చీలో వెనక్కువాలి సుధారాణి రూపాన్ని ఊహించుకోసాగాడు.

స్కూలుఫైనల్ పాసుకాగానే ముకుందం పైచదువుల జోలికిపోక యల్. డి. గుమాస్తాగా ఉద్యోగంలో చేరాడు. ముకుందానికి తనపేరుకు ముందు మిస్టర్ అని చేర్చుకోవడం చాలా ఇష్టం. అతన్ని మిస్టర్ ముకుందం అని పిల్చేవాళ్ళంటే మరీ ఇష్టం. ఆఫీసుకు రాగానే మిస్టర్ ముకుందం అని పిల్చినవాళ్ళపంట ఆరోజు పండిందే. మధ్యాహ్నం లంచ్ అవర్‌లో హోటల్లో వేడి వేడి పెసరట్టు, కాఫీ ఇప్పిస్తాడు. ఒక్కొక్కనాడు ఒక్కొక్కరిమీద ముకుందానికి ఎందుకంత అభిమానం పుట్టుకొస్తుందో అర్థం అయేదికాదు ఎవరికీ.

మిస్టర్ ముకుందానికి చిన్నప్పటినుంచి కథలు చదవడం, ముఖ్యంగా ప్రేమ కథలు చదవడం చాలా ఇష్టం. ఓ శుభోదయాన అతని మనసులో కథలు వ్రాయాలనే కోర్కెతలెత్తింది. ఆ వెంటనే తను చదివిన నాలుగైదు మంచికథల్లోని సంఘటనల్ని ఏర్చికూర్చి ఒక కథ వ్రాసేశాడు. దాన్ని ఒక ప్రముఖ పత్రికకు పంపించాడు. నెల తిరక్కుండానే అది అతని చేతిలోకే వచ్చి వాలిపోయింది చెక్కుచెదరకుండా.

ముకుందానికి వెంటనే ఒక ఉపాయం తట్టింది.తను ఆడపేరుతో పంపిస్తే ?

వెంటనే "అనూరాధ" అనే పేరుతో మరోపత్రికకు పంపించాడు. ఆ పత్రికలో చాలావరకు ఆడవాళ్ళ కథలే వేస్తారని తెలుసు ముకుందానికి. నెలతిరక్కుండానే కథ అచ్చయింది. "అనూరాధ" పేరుతో తాటికాయంత అక్షరాల్లో కనిపించేసరికి ముకుందానికి మూర్ఛ వచ్చినంత పనయింది.

ఆ తర్వాతనుంచి ముకుందం అడపా దడపా "అనూరాధ" పేరుతోనే కథలు వ్రాస్తున్నాడు. అవి అచ్చు అవుతున్నాయి.

తన కథలకేం ? ఎందుకు అచ్చుకావు ? ఇప్పుడొస్తున్న ఎన్ని కథలు తెల్లవారేసరికి గుర్తుంటున్నాయి గనక. ప్రతికథా ఎక్కడో చదివినట్టే అనిపిస్తుంది. తన కథకు ఏవో ఆధారాలు ఉంటేమాత్రం ఏమిటి ? తనకథలు గుర్తులేకపోయినా పాఠకలోకంలో "అనూరాధ" అనేపేరు గుర్తుంటేచాలదు?

ముకుందానికి ఆత్మవిశ్వాసం బాగానే కుదిరింది.

ఆమాటకొస్తే ఈనాటి గొప్ప రచయితలుగా చలామణీ అయ్యే ....పేరెందుకులే....ఎందరికథలకు మూలకథలున్నాయని చెప్పుకోవడం లేదు ?

భావ చౌర్యంతో బాధపడే అంతరాత్మను ఇలా అప్పు డప్పుడు జోకొట్టి నిద్ర పుచ్చటానికి ప్రయత్నిస్తుంటాడు మిస్టర్ ముకుందం.

ఇది ఇలా ఉండగా ఒకనాడు ఒక స్త్రీ పాఠకురాలినుంచి పాన్ ఉత్తరం వచ్చింది మిస్టర్ ముకుందానికి - అనూరాధ పేరుమీద పత్రిక అడ్రసుకు వ్రాసిన ఉత్తరం అది.

ఆ అభిమాన పాఠకురాలి పేరు సుధారాణి. ఆమెకు ముకుందం కథలంటే చాలా ఇష్టంట. తను. అనూరాధ పరిచయభాగ్యంకోసం ఆమె తహతహలాడి పోతోందిట. జవాబు తప్పకవ్రాసి తనకు సంతోషాన్ని తప్పక కలిగించాలట.

ఉత్తరం చదివిన ముకుందానికి జాక్‌పాట్‌లో లక్షరూపాయలు వచ్చినట్టనిపించింది. తిరుగుటపాలో జవాబిచ్చాడు ముకుందం. సుధా రాణిగురించి యెన్నోప్రశ్నలు వేస్తూ ఉత్తరం వ్రాశాడు.

తను బి. ఏ. చదువుతున్నాననీ, తను ఒక పెద్ద గవర్నమెంటు ఆఫీసరు కూతుర్ననీ, సుధారాణి జవాబిచ్చింది.

బాబోయ్ ! అంత పెద్ద ఆఫీసరు కూతురే ? పైగా పెద్ద చదువు చదువుతోందాయె? అనుకొని మళ్ళీ ఉత్తరం వ్రాయటానికి ముకుందం భయపడ్డాడు ? కాని సుధారాణీనుంచి ఉత్తరాలమీద ఉత్తరాలు రాసాగాయి.

క్రమంగా అతనిలోని బెదురుపోయింది. తను రచయిత ! రచ

యితకు డిగ్రీలెందుకు ! రచయితగా తనకు సమాజంలో ఓ విశిష్టమైన స్థానంవుంది.

రచయిత్రిగానే తనను అంత ఆరాధిస్తున్న ఆ అమ్మాయి తనను రచయితగా తెలుసుకుంటే అమాంతం ప్రేమించి వేయదూ?

ఆ భావం రాగానే ముకుందానికి ఎలాగో ఎలాగో అనిపించింది. ఈమధ్య ప్రతి చిన్నవిషయానికి తనకు యెలాగో యెలాగో ఉంటుంది. యెందుకో ? యెందుకేమిటి తను రచయితగా ? రచయిత హృదయం ప్రతి చిన్నవిషయానికి స్పందించాలిగా మరి !

ఇద్దరిమధ్యా ఓ రెండుమూడునెలలు ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయ్. ముకుందం సినీమాలో హీరోలా పగటి కలల్లోనే సుధారాణితో వనవిహారాలూ, వెన్నెలపాటలూ, బోటుషికార్లూ బోలెడన్ని చేశాడు.

సుధారాణి ఓదివ్య సుందర విగ్రహంగా ముకుందం కనుపాపల్లో నిలిచిపోయింది.

ఇన్నాళ్ళకు తన సుధారాణిని, తన హృదయరాణిని చూసే క్షణం రానేవచ్చింది. ఆ అమ్మాయికి చాలా ధైర్యం. తిన్నగా తన యింటికే వస్తానని రాసింది. అది చదివి తనకు చెమట్లు పట్టాయి. ఇంత చిన్న యింట్లోని ఓ చిన్నగదిలో.... నెలకు పదిహేను రూపాయల అద్దె గదిలో....తనను చూసి సుధారాణి ఏమనుకొంటుంది? 'ఫస్ట్ఇంప్రెషన్ యీజ్ బెస్ట్ ఇంప్రెషన్' అన్నారు. ప్రేమ ప్రథమ దృష్టిలోనే ఏర్పడుతుందట. మొదటిసారి పరిచయం అందమైన ప్రదేశంలో జరిగితేనే దానికి ఓ అందం చందం-అర్థం. తను చాలా బీదవాడనీ, యల్. డి. గుమాస్తా అనీ ముందుగానే తెలియకూడదు.

తమ మొదటి పరిచయం పబ్లిక్‌గార్డెన్స్‌లో ప్రకృతి ఒడిలోజరగాలని తన అభిలాష అని వ్రాశాడు.అందుకు సుధారాణి అభ్యంతరం చెప్పలేదు.

ముకుందం వాచీ చూసుకున్నాడు. కుర్చీక్రింద ఏదో ప్రేలబోతున్నట్లు లేచినిల్చున్నాడు. అయిదున్నర అయింది. అర్థగంటలో తనుపబ్లిక్ గార్డెన్స్‌కు చేరాలి,

ఈ హైదరాబాద్ నగరంలో అవసరానికి టాక్సీలన్నా దొరికి ఏడవ్వు. అరగంటలో తను అక్కడికి చేరగలడా ?

గదికి తాళంవేసి రోడ్డుమీద కాలుపెట్టిన ముకుందానికి ఓ అనుమానం కలిగింది.

ఇంతాచేసి తనను స్త్రీ కాదని తెలిసికున్న సుధారాణి సినిమాల్లోని హీరోయిన్‌లాగ కోపంతో తాను చేసిన మోసాన్ని గురించి అర్ధగంట అనర్గళంగా ఉపన్యాసం దంచి, తుపుక్కున ముఖంమీద ఊసి, గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోతే? తనకు క్షమాపణ చెప్పుకొనే అవకాశాన్ని కూడా యివ్వకపోతే?

ముకుందానికి గుండెకాయ గొంతులోకి ఎగబాకినట్టయింది.

అలా ఎప్పటికీ జరగదు. తను అనవసరంగా భయపడుతున్నాడు అనుకొన్నాడు, మొండికెత్తిన వాడిలాగా.

ఆ అమ్మాయికి తన కథలంటే మహాఇష్టం. చాలామంది స్టూడెంట్సుకు కథలు రాసేవాళ్ళంటే ఇష్టం....మహాపిచ్చి.

పిచ్చికీ, ప్రేమకూ, అట్టే భేదంలేదని రాసింది తనేనా? కాదు.... ఎవరో పోనియ్.... గుర్తులేదులే.

ముకుందం తనకు తానే సర్దిచెప్పుకుంటూ గొంతులోకి ఎగబాకిన గుండెకాయను యథాస్థానంలోకి పంపించే ప్రయత్నం చెయ్య సాగాడు.

పెళ్ళి చేసుకోవడం అంటూ జరిగితే తను ప్రేమించిగాని పెళ్ళి చేసుకోకూడదని ఏనాడో నిర్ణయించుకున్నాడు. అమ్మా నాన్నా కుదిర్చిన ఏ అప్పలమ్మ మెళ్ళోనో తను చస్తే తాళికట్టడు.

ఒక వేళ సుధారాణికి తన రూపం నచ్చకపోతే తను పెద్ద చదువులు చదవలేదనీ, చిన్న గుమాస్తా అనీ తెలిసి చిన్నచూపు చూస్తే?

ఎంత మనస్సును మభ్యపెట్టుకోవటానికి ప్రయత్నిస్తున్నా ఏదో అనుమానం తేలు పిల్లలా కొండీ ఎత్తుకొని అతని బుర్రలో అశాంతిగా తిరుగుతూనే ఉంది.

ముకుందం ఊపిరి గట్టిగా పీల్చుకొని నడకవేగం హెచ్చించాడు.

రూపం ఎందుకు? కోసుకుతినటానికా? ఈ రోజుల్లో పెద్ద ఉద్యో గాలు చెయ్యడం గొప్పకాదు. అంతా ఇన్‌ఫ్లుయన్స్. డిగ్రీలు ఎందుకు? ఎం. ఎ. చదివినవాణ్ణి తాజమహల్ ఎవరు కట్టించార్రా అంటే. గుడ్లు మిటకరించుకొని చూస్తాడు. సమాజంలో విశిష్టస్థానం సంపాదించాలి. ఒక ప్రత్యేకతను సంపాదించుకోవాలి. తను రచయిత. ఈనాడు రచయిత లకూ, కళాకారులకూ, కవులకూవున్న గౌరవం ఎవరికుంది? లోకంలో ఎందరు 'విగ్రహం పుష్టి-నైవేద్యం నష్టి' గాళ్లులేరు? బుర్రనిండా వుంది బురదే అయినా పెద్దవాళ్ళ అండతో పెద్దకుర్చీలు సంపాదించిన మొద్ద బ్బాయిలూ, మొద్దమ్మాయిలూ ఎంతమందిలేరు? కాని రచయిత కావడం మాటలా? అందరికీ సాధ్యపడేదా? అసలు తన సుధారాణి....రాణి అంటేనే బాగుంది....తను అలాగే పిలుస్తాడు.

ఆఁ ఏమిటి తనుఅనుకుంటున్నది? తనరాణి ఆరాధిస్తున్నది తన రూపాన్నీ, హోదానూ కాదుగా? తనలోని రచయితను ఆమె ఆరాధిస్తు న్నది. తను రచయిత. ఆమెకు కావల్సింది తను రచయితగానే.

మొండిగా ఎదురుతిరుగుతున్న మనస్సును సమాధాన పర్చుకో సాగాడు.

ముకుందం ఆలోచనలతో తల మునకలైపోతూ పబ్లిక్‌గార్డెన్స్‌లో ప్రవేశించాడు.

ఆ బెంచీ....అదే తన పక్కనే తన రాణీ కూర్చోబోయే ఆ బెంచీ....తన ప్రణయజీవితంలోని మొదటి క్షణాన్ని ప్రసాదించ బోయే ఆ బెంచీ అంటే తన కెంతో ఇష్టం. మొదట ఉద్యోగందొరక్క బాధపడే రోజుల్లో, అంత పెద్ద గార్డెన్‌లో ఎక్కడా చోటులేనట్టు పెడగా, ఒంటిగా, మారుమూలగావున్న ఆ బెంచీని తను తనజీవితంతో పోల్చుకొనేవాడు. ఆ బెంచీ కింద రోజులకొద్దీ కూర్చొని తన సొదను వెళ్ళబోసుకొనేవాడు. తనకు అది కష్టాలలో సానుభూతి చూపిస్తూ తనకు ఆశ్రయం ఇచ్చినట్లు ఊహించుకొనేవాడు.

దూరంగా తననుచూసి "వస్తున్నారా? నీ కోసమే ఎదురు చూస్తు న్నాను" అంటూ ఆ బెంచీ తనను ఆహ్వానిస్తున్నట్లు విచిత్రమైన అను

భూతిని పొందేవాడు. ఆకలి కడుపుతో ఎన్నో రాత్రిళ్ళు ఆ బెంచీమీద మగత నిద్రలో గడిపాడు. ఆ బెంచీమీదనే ఉద్యోగం దొరికాకకూడా తాను దానిమీద ఏర్పడిన అనుబంధాన్ని తెంచుకోలేకపోయాడు. రోజూ సాయంత్రం ఆ బెంచీమీద గడపకపోతే తనకు పిచ్చెత్తినట్టుంటుంది. తన మొదటి కథకూడా ఆ బెంచీమీద కూర్చొనేరాశాడు. తన ప్రణయ జీవితంలో మొదటి ఘట్టంకూడా.....

ఆలోచిస్తూ ఆ బెంచీని సమీపించిన ముకుందం కరెంట్‌షాక్ తగిలినట్టు తృళ్ళిపడ్డాడు. ఏనాడూలేనిది ఆ బెంచీమీద మరో యువకుడు కూర్చొనివున్నాడు. ముకుందం నీళ్ళుకారిపోయాడు. టైంచూసుకున్నాడు. ఆరూ పదిహేను అయింది. ముకుందానికి ఏడుపొచ్చినంత పనయింది.

ఆరుగంటలకే రాణీ వచ్చి ఆ బెంచీమీద ఎవరో యువకుడు ఉండటంచూసి వెళ్ళిపోయిందేమో? అప్పుడే వస్తుందా? ఎందుకయినా మంచిది. కాసేపు అక్కడ కూర్చుని చూస్తేసరి.

బెంచీకేసి నడుస్తున్న ముకుందాన్ని ఆయువకుడు కుతూహలంగా చూస్తున్నాడు. ముకుందం అప్రయత్నంగానే చిరునవ్వు నవ్వాడు.

"నాకు వీ డెక్కడ దాపురించాడు." అన్నట్లు ఆయువకుడు ముఖం చిట్లించుకొని తల తిప్పుకున్నాడు.

ముకుందానికి అతనిమీద పట్టరాని కోపం వచ్చింది. తన బెంచీ మీద వచ్చి కూర్చొని తన ప్లానంతా పాడుచేసిందికాకుండా పైగా తనను చూసి ముఖం చిట్లించుకొంటున్నాడు.

ముకుందానికి అతన్ని చెప్పుతీసుకొని కొట్టాలనిపించింది. చెట్టుకు కట్టి చింతబరికెతో కొట్టాలనిపించింది.

వీడెవడో పానకంలో పుడకగాడు తన మధుర స్వప్నాన్ని చెరిపేశాడు. "ఓ భగవంతుడా! ఇప్పుడు నీదే భారం! ఇంతవరకూతెచ్చి నన్ను దగా చెయ్యకు భగవాన్" అనుకొంటూ మనస్సులో భగవంతుడిని ధ్యానించుకొన్నాడు ముకుందం.

ఒక స్త్రీ ఉండవలసినచోట ఇద్దరు పురుషుల్ని చూసి తనసుధ.... అదే రాణి....దూరంనుంచి తిరిగి పోదుగదా?

ఇంతకాలం తనకు ఆశ్రయంఇచ్చిన ఆ బెంచీయే తనను భూమి లోకి దించేస్తున్నట్టు బాధపడ్డాడు ముకుందం.

ఈ పానకంలో పుడకగాడు కదిలేలాలేడు. ముకుందం అతనివైపు కొరకొరా చూశాడు. నిమిషంలో తాను రాక్షసుడు కానందుకు, ఆ యువకుడ్ని అమాంతం మింగేయలేనందుకు బాధపడ్డాడు.

ఆ యువకుడుకూడా మాటిమాటికి గడియారం చూసుకుంటూ బెంచీమీద అశాంతిగా కదలసాగాడు. ముకుందంవైపు మధ్య మధ్య చురచుర చూడసాగాడు.

ఆరున్నర అయింది. ఇంకా రాదేం తన రాణి? కాని ఎలావస్తుం దిక్కడకు? దూరంనుంచే చూసి వెళ్ళిపోయిందేమో?

"ఒక్కసారి తోటంతా తిరిగివస్తే? వంటరిగా నిరాశతో ఎవరి కోసమో వెతుకుతున్న తన రాణినే గుర్తించలేడా?

ముకుందం అక్కడ్నుంచి కదిలాడో లేదో ఆయువకుడు పీడా విరగడయ్యినట్టు నిట్టూర్చాడు. ముకుందానికి అతన్ని చీమలపుట్టకి కట్టా లనిపించింది. చుట్టూ కలియచూస్తూ పబ్లిక్‌గార్డెన్‌లో నడుస్తున్న ముకుం దానికి అల్లంతదూరంలో ఒకఅమ్మాయి-చెంపకు చేరడేసి కళ్ళతో, కోడె త్రాచులాంటి జడతో, పచ్చని శరీరచ్ఛాయతో, అధునాతన వేషంలో, ఎవరికోసమో వెదుకుతూన్నట్టు చూస్తూ వయ్యారంగా నడచి రావటం కనిపించింది.

ఆమెను చూడగానే ముకుందానికి ప్రాణంలేచి వచ్చింది. ఇంకా అనుమానం యెందుకు? ఆ అమ్మాయి తనసుధే! ఆ పెద్దపెద్ద కళ్ళలో యెంత కుతూహలాన్ని నింపుకొని తనకోసం వెతుకుతోందో? ఇంకా సందేహమెందుకు?

గబగబా ఆమెకు యెదురువెళ్ళి నిల్చున్నాడు ముకుందం. హృద యంలోని అనురాగ రసాన్ని కళ్ళతో కురిపిస్తూ బొంగురుపోయిన కంఠంతో "సుధా!" అన్నాడు.

కథా నిలయం
5517

ఆ అమ్మాయి బిత్తరపోయి చూసింది.

"నేను సుధా.... నేను నీ అభిమాన...."

"షటప్ ఇడియట్ !"

ఎవరో వీపుమీద లాగి తన్నినట్టయింది ముకుందానికి.

ఇంతలో వెనకనుంచి "హలో ! వసూ ! ఆలస్యం అయింది కదూ ?" అంటూ ఓ అందమైన యువకుడు ఆ అమ్మాయి దగ్గర కొచ్చాడు.

ముకుందం పూర్తి తేరుకొనే సరికి ఆ అమ్మాయీ ఆ యువకుడూ పదిగజాల దూరంలో నిల్చొని కన్పించారు. ఆ అమ్మాయి ఆ యువకుడితో ఏదో చెబుతుంది. అతను ముకుందంకేసి చూశాడు. ముకుందానికి ప్రాణాలు ఎగిరిపోయినట్లయింది.

దేహశుద్ధి జరిగేలాగుంది. అతనిముందు తనెంతమనిషి? పిట్టంత మనిషి ? పరుగూ నడకా కానివేగంతో ముకుందం తన బెంచీదగ్గర కొచ్చి పడ్డాడు. చేతులకు పట్టిన చెమటను కర్చీపుతో తుడుచుకున్నాడు.

"ఏమండీ ! ఏదో పులి కనిపించినట్టు అట్టా గాబరాగా పరుగెత్తు కొచ్చారు?" అడిగాడు బెంచీమీద యువకుడు నవ్వుతూ.

"అబ్బే ! ఏంలేదే, అసలేం చూడందే ?" గాబరాగా ఏదో అనేశాడు ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ ముకుందం.

"ఏమీ లేకపోవడం ఏమిటీ ? ఒంటరిగాఉన్న ఆడపిల్లనైనా కదిలించి చూశారా ఏమిటి ?" అన్నాడు వస్తున్న నవ్వును ఆపుకుంటూ ఆ యువకుడు.

ముకుందం ముందు తెల్లపోయాడు.

"అయితే మీరు నన్ను యెందుకు వెంటాడుతున్నట్లు ?" తేరుకొని విసుగ్గానే అడిగాడు ముకుందం.

"మిమ్మల్ని నేను వెంటాడటం ఏమిటండోయ్ ?"

"మరి లేకపోతే మీకెట్టా తెలిసింది ?"

"ఓ అదా! మీ వాలకం చూసి అనుకున్నానులెండి. అయితే నిజమేనన్నమాట?"

అసలే ముకుందం ముఖం చిన్నది. తోటివాళ్ళు చిన్నప్పుడు దమ్మిడీ ముఖంగాడు అనేవాళ్లు. ఆ చిన్నముఖం మరీ చిన్నది అయింది. ఆ ముఖం చూస్తుంటే ఆ యువకుడికి జాలివేసింది.

"బాధ పడకండి, ఇలాంటివి కుర్రాళ్ళ జీవితంలో అప్పుడప్పుడు జరుగుతూంటేనే అందం అదే వైవిధ్యం" అన్నాడు ఆ యువకుడు.

"నేను అలాంటి అల్లరి చిల్లరివాణ్ణికాదండీ!" గుటకవేశాడు ముకుందం.

"అది కాదండీ! అసలు విషయం ఏమిటంటే!" మళ్ళీ గుటక అడ్డం వచ్చింది.

ఆ యువకుడికి ముకుందాన్ని చూస్తుంటే సరదాగా వుంది.

"ఆగిపోయారేం! చెప్పండి!" అన్నాడు.

"అసలు విషయం ఏమిటంటే నేను ఒక అమ్మాయిని కలుసుకుందామని వచ్చానండీ, ఇక్కడే! ఈ బెంచీమీదే కలుసుకోవాలనుకున్నాం. చిక్కల్లా ఇంతకుముందు ఆ అమ్మాయిని నేను చూడలేదు."

ఆ యువకుడు ఆలోచనలో పడ్డాడు.

"మీరు నాకంటే ముందే ఇక్కడకొచ్చి కూర్చున్నారు. అందుకని ....?"

కొంచెం ఆగి "అయితే మీరు యెదురు చూస్తుంది సుధారాణి కోసమేనా?" అడిగాడు ఆ యువకుడు.

ముఖం తెల్లబోయి చూశాడు. ఇతనికెలా తెలిసిందబ్బా! తన విషయం తెలుసుకొని అన్నను సుధారాణి పంపలేదుగదా! ముకుందం గుండెలు దడదడ కొట్టుకొన్నాయి.

"మీరు అనూరాధ....?"

ముకుందం యెగిరిపడ్డాడు.

"కాదు....ఆఁ అవును....కాదు...."

"అవునూ....కాదు....యెందుకంత గాబరాపడతారూ? మీరు అనూరాధ...."

"కాదండీ! అనూరాధ అన్నగారిని...." అనేశాడు ముకుందం నాలుక్కి అతుక్కుపోతున్న అక్షరాలను బయటకు బలవంతంగా నెడుతున్నట్టు.

ఆ యువకుడు ముకుందం ముఖంలోకి గుచ్చి గుచ్చి చూశాడు. ముకుందం అశాంతిగా కదిలాడు.

"ఓ భగవంతుడా! యెలాగయినా ఈ గండంనుంచి బయటపడేయ్!" అనుకున్నాడు ముకుందం.

"అయితే మీరు అనూరాధ...." ముకుందం మళ్ళీ ఉలిక్కిపడటం చూసిన ఆ యువకుడు ముసి ముసిగా నవ్వుకొన్నాడు.

"మీరు సుధారాణి అన్నగారా?" యెలాగో అడిగాడు ముకుందం అతని నవ్వుముఖంచూసి.

"కాదు...."

"మరి ప్రియురాలా?" వళ్లు మండిపోయి అడిగాడు ముకుందం.

"కాదు" అన్నాడు చిరునవ్వుతో.

"అయితే ఆమె మీకేమవుతుంది?" ధైర్యంగా అడిగాడు ముకుందం.

"నా పేరు సుధాకర్."

"నీ పేరెవడికి కావాలి? సుధకు నువ్వేమవుతావో చెప్పి ఏడవక?" మనసులోనే అనుకున్నాడు ముకుందం.

"నా పెన్ నేమ్ అంటే కలంపేరు...."

"మీరు కథలు రాస్తారా?" ఆశ్చర్యంగా అడిగాడు ముకుందం

"అబ్బే నాకు కథలు రాసేంత ఓపిక లేదండీ?"

"ఏడ్చావ్! ఓపిక లేదంట ఓపిక. రాయటంగాదని ఏడవకూడదూ. కవిత్వం యేడుస్తాడులావుంది" అనుకొని "మరి కవిత్వం రాస్తారా?" అని అడిగాడు.

"కవిత్వమే? బాబోయ్! ఆ పేరంటేనే నాకు భయం!"

"మరి పెన్‌నేమ్ దేనికయ్యా ?" ఈసడింపుగా అడిగాడు ముకుందం.

"కథలూ కవిత్వం రాసేవాళ్ళకు ఉత్తరాలు రాస్తుంటాను. అది నా హాబీ !"

"ఏడవలేకపోయావ్ !" అనుకున్నాడు ముకుందం కసికసిగా.

"ఇంతకూ మీ కలంపేరు చెప్పారుగాదు." ఎగతాళి ధ్వనించే కంఠంతో ప్రశ్నించాడు ముకుందం.

"సుధారాణి" అంటూ ఆ యువకుడు ముకుందం కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూశాడు.

"ఆఁ" అంటూ తెరిచిన ముకుందం నోరుమూత పడటానికి మూడునిమిషాలయినా పట్టి వుంటుంది.

"ఉత్తరాలు రాయటానికి ఆడపేరు యెందుకు ?"

"కొందరు మగవాళ్లు ఆడపేర్లు పెట్టుకొని కథలెందుకు రాస్తున్నారూ ?" సాగదీస్తూ అన్నాడు ఆ యువకుడు కొంటెగా.

మరు నిముషంలో యెలా చేరుకున్నాడో పబ్లిక్‌గార్డెన్ గేటులో వున్నాడు ముకుందం.

యెదురుగావున్న క్లాక్‌టవర్ ముకుందాన్ని పరామర్శిస్తున్నట్లు ఏడుకొట్టింది.

క్లాక్‌టవర్ బద్దలుకొట్టాలనిపించింది. పక్కగాపోతున్న గేదెను మోచేతితో పొడవాలనిపించింది. ఎలక్ట్రిక్ స్థంభానికి వళ్ళు రుద్దుకుంటున్న కుక్కమీదకు రాయి విసరాలనిపించింది. జుట్టు పీక్కోవాలనిపించింది. ఏడవాలనిపించింది.

కొత్త బూట్లు శబ్దం చేసుకుంటూ వడివడిగా నడుస్తున్న ముకుందం చెవుల్లో తన వెనకనుంచి ఆ యువకుడు నవ్విన నవ్వు యింకా వినిపిస్తూనే వుంది.

—22-1-1971 ప్రగతి సచిత్రవారపత్రికనుంచి